
సాక్షి
వికారాబాద్
మంగళవారం । 13 । జూన్ । 2023



పాత వేతనాలకే దిక్కులేదు..

రాష్ట్ర వ్యాప్తంగా అర్చకులకు సకాలంలో వేతనాలు అందడం లేదు. దీంతో పూట గడవక అవస్థలు పడుతున్నారు.

8లో ▸



ఫలించిన పోరాటం

యాలాల మండల కేంద్రంలో ఇళ్ల స్థలాల కోసం 15 ఏళ్లుగా పేదలు చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది.

8లో ▸



నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే నడక, పరుగు, యోగాతోనే సాధ్యమని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు.

9లో ▸

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ

వికారాబాద్ అర్బన్: ఎస్‌బీఐ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ చిలుకూర్‌లో కారు డ్రైవింగ్, సీసీ టీవీ కెమెరా సర్వీసింగ్‌లో పురుషులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సంచాలకులు కె.రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 13నుంచి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. 19నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే శిక్షణ 30 రోజుల పాటు కొనసాగుతందని, ఈ సమయంలో ఉచిత హా స్టల్, భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 8639079122, 7981951167, 9000778300 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరేందుకు మొదటి విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని వికారాబాద్ ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ నరేంద్ర బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023– 24 విద్యా సంవత్సరానికి సంబంధించి htt pr://iti.teanfana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 19 చివరి తేదీ అని తెలిపారు. టెన్త్‌తో పాటు ఎనిమిదో తరగతి పూర్తి చేసిన వారికి సైతం ప్రత్యేక కోర్సులు అందుబాటులో ఉన్నాయని, వివరాలకు 9441430963, 9177472488 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆర్డీఓ తదితరులు

అనంతగిరి: ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ పట్టణంలో సోమవారం బాలల హక్కుల పరిరక్షణ వేదిక, ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలని కోరుతూ ఆర్డీఓ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు శివరాజ్, జనార్దన్, నాగరాజు, శ్రీనివాస్, వెంకటయ్య, రామేశ్వర్, యాదయ్య, దేవకుమారి, ఆశలత, వెంకటేశ్, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు

రేపటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

వికారాబాద్ అర్బన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 14 నుంచి 22 వరకు కొనసాగుతాయని డీఈఓ రేణుకాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 26 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఎగ్జామ్స్ ఉంటాయని, పరీక్షలు నిర్వహిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలెటర్లు ఎవరూ కూడా సెంటర్‌లోకి సెల్ ఫోన్లు తీసుకవెళ్లకూడదని తెలిపారు. సమయానికి గంట ముందే సెంటర్లకు చేరుకోవాలని, హాల్ టికెట్ మర్చిపోకూడదని విద్యార్థులకు సూచించారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు ప్రారంభం

అనంతగిరి: ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఫస్టియర్‌కు చెందిన 1,383 మంది విద్యార్థులకు గానూ 1,280 మంది, సెకండ్ ఇయర్‌కు సంబంధించి 424 మందికి గాను 380 మంది మొదటి రోజు పరీక్షకు హాజరయ్యారని జిల్లా ఇంటర్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు.

నేడు బ్రాహ్మణపల్లికి షెడ్యూల్ కులాల వైస్ చైర్మన్

దోమ: జాతీయ షెడ్యూల్ కులాల వైస్ చైర్మన్ అరుణ్ హల్దర్ మంగళవారం బ్రాహ్మణపల్లికి రానున్నారు. ఆలయ ప్రవేశ విషయంలో దళితులకు, బీసీలకు జరిగిన ఘర్షణపై విచారణ చేపట్టేందుకు ఉదయం 11:45 నిమిషాలకు ప్రత్యేక భద్రత మధ్య ఆయన గ్రామానికి రానున్నారని డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకోనున్నారు.

బడివడిగా..



వేసవి సెలవుల్లో సరదాగా గడిపిన విద్యార్థులు సోమవారం బడిబాట పట్టారు. ఉత్సాహంగా కేరింతలు కొడుతూ స్నేహితులతో కలిసి స్కూళ్లకు చేరుకున్నారు. తొలిరోజు కావడంతో హాజరు శాతం అంతంతగానే నమోదైంది. పలు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

బొంరాస్‌పేట: దీప్లానాయక్‌తండాలో విద్యార్థులను తీసుకుని స్కూల్‌కు వెళ్తున్న ఉపాధ్యాయురాలు



దోమ: శివారెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాఠ్యపుస్తకాలతో విద్యార్థులు

భూ వివాదాల్లో ఎమ్మెల్యేలు!

హాట్ టాపిక్‌గా తరచూ ఎవరో ఒకరి పేరు
- పవర్, పరపతి వినియోగిస్తూ దందాలు
- తాజాగా కొడంగల్ ఎమ్మెల్యేపై కేసు నమోదు



వికారాబాద్: జిల్లాలోని ఎమ్మెల్యేలపై తరచూ భూ ఆక్రమణ, ఇసుక అక్రమ రవాణా వంటి ఆరోపణలు రావడం పరిపాటిగా మారింది. రాజకీయంగా క్షేత్రస్థాయిలో పట్టుకోసం ప్రయత్నిస్తున్న నేతలు భూ దందాలు నిర్వహిస్తూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. దీనికి ఎవరూ అతీతంగా ఉండటం లేదు. వీరు భూ తగాదాలు, సెటిల్మెంట్లలో తలదూర్చిన వీడియోలు గతంలో వైరల్ కాగా.. తాజాగా కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సైతం ఇలాంటి కేసులోనే చిక్కుకున్నారు. ఓ భూమి విషయంలో తమ వద్ద రూ.మూడు కోట్లు తీసుకుని.. మళ్లీ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఓ వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఎమ్మెల్యేపై కోర్టు రెఫరల్ కేసు నమోదైంది. ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని, ఏవైనా ఆధారాలు ఉంటే చూపించాలని ఎమ్మెల్యే సవాలు విసురుతున్నప్పటికీ ప్రస్తుతం ఈ వ్యవహారం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

అందరిదీ అదే దారి

జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు భూ వివాదాల్లో ఎవరికి వారే తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. గతంలో వీరికి సంబంధించిన వివరాలతో సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగింది. అధికార పార్టీకి చెందిన వారు కావడంతో తమ పలుకుబడిని వాడుకుని కేసులు నమోదు కాకుండా చూసుకున్నారనే వాదనలు ఉన్నాయి.

- వికారాబాద్ మండల పరిధిలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టుతో పాటు, అసైన్డ్ భూముల్లో వెలిసిన రిసార్ట్స్ ఇతర కార్యకలాపాలు తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అండదండలతోనే జరుగుతున్నాయనే ఆరోపణలు వచ్చాయి.
- ఈ విషయాలు పలుమార్లు మంత్రి, కలెక్టర్ వరకు వెళ్లినా కబ్జా చెర వీడకపోవడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.
- తాండూరులో రూ.వంద కోట్ల విలువ చేసే విద్యా వికాస్ ట్రస్టు భూ వివాదం, సెయింట్ మార్క్స్ భూ వివాదం, మరో ప్రభుత్వ స్థలం విషయంలోనూ ఎమ్మెల్యే హస్తం ఉందనే ఆరోపణలు వినిపించాయి.
- రెండు నెలల క్రితం పరిగి ఎమ్మెల్యే సైతం ఓ భూవివాదంలో జోక్యం చేసుకోవటం విమర్శలకు తావిచ్చింది.
- వికారాబాద్‌లోని అనంతగిరి వెళ్లేదారిలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ఓ వెంచర్ వివాదంలో, ఆలంపల్లి శ్మశానవాటిక కబ్జా, కొత్తగడి సమీపంలోని మరో భూవివాదంలో ఎమ్మెల్యే ఆనంద్‌తో పాటు ఆయన అనుచరులు అనేక సార్లు కల్పించుకున్నారని ప్రచారం సాగింది.

కూడబెట్టేందుకే భూ దందాలు

- ఇటీవల జిల్లాలో రియల్ ఎస్టేట్ బాగా పుంజుకోవడం, భూముల ధరలు భారీగా పెరగడం, ధరణి కారణంగా అనేక భూములు వివాదాల్లో చిక్కుకోవడం వంటి అంశాలు వీరికి కలిసొచ్చాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.
- పెద్ద మొత్తంలో డబ్బు కూడబెట్టేందుకు కబ్జాలే ఏకైక మార్గమనే ధోరణిలో నేతలు ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- ఇటీవలి వరకు ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని పెద్ద ఎత్తున పైరవీలు సాగించారని తెలుస్తోంది.
- గతంలో ఇక్కడ పనిచేసిన జిల్లా ఉన్నతాధికారి ద్వారా ధరణి ఫైళ్లను వందల సంఖ్యలో క్లియర్ చేయించి. పెద్దమొత్తంలో లబ్ధి పొందారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

పోలీసుల సేవలు అమోఘం



వికారాబాద్‌లో నిర్వహించిన 2కే రన్‌లో పరుగులు పెడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

- రాష్ట్రాభివృద్ధిలో వీరి పాత్ర కీలకం
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి
- దశాబ్ది వేడుకల్లో భాగంగా వికారాబాద్‌లో 2కే రన్
- విజేతలకు బహుమతుల ప్రదానం

అనంతగిరి: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చేస్తున్న కృషి అమోఘమని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 2కే రన్‌ను స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎస్పీ కోటిరెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకుపోతోందన్నారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే.. సంక్షేమం, అభివృద్ధిలో మనమే ముందున్నామని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న శాంతియుత వాతావరణం, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులకు ఆకర్షితులవుతున్న పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని వివరించారు. తప్పు చేసే వారికి మాత్రమే పోలీస్ వ్యవస్థ శత్రువుగా కనిపిస్తుందని, మిగిలిన వారికి ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో సేవలు అందజేస్తోందని తెలిపారు. ఆడపిల్లలకు ఎక్కడ చిన్న ఇబ్బంది జరిగినా ఒక్క ఫోన్‌తో షీటీం బృందాలు అక్కడకు చేరుకుంటున్నాయని చెప్పారు. ఈనెల 22న వికారాబాద్‌లో అమర వీరుల స్థూపాన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధిలో పోలీస్ శాఖ చాలా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కేసులను త్వరితగతిన ఛేదిస్తున్నామని తెలిపారు. అనంతరం రన్‌లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మంజుల, ఆర్డీఓ విజయకుమారి, డీఎస్పీ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, డీఏఓ గోపాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్, ఎంపీడీఓ సత్తయ్య, టౌన్ సీఐ శ్రీను, మహిళా పీఎస్ సీఐ ప్రమీల, సీఐలు, ఎస్ఐలు, వాకర్స్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్ అర్బన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు అవసరమైన అవసరమైన ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను పనితీరు పరిశీలన కొనసాగుతోందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈసీఐ కంపెనీ ద్వారా మొదటి విడత పరిశీలన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గోదాంలోని యంత్రాలను ఎస్పీ కోటిరెడ్డి, వివిధ పార్టీల నేతలతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈనెల 22 వరకు మొదటి విడత పరిశీలన పూర్తి చేస్తామని స్పష్టంచేశారు. బాగా పని చేసే వాటిని గోదాం భద్రపర్చి, సరిగా పని చేయని వాటిని తిరిగి పంపిస్తామన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రవీందర్ దత్తు, ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడిని ఆదర్శంగా తీసుకోవాలి

షాబాద్: సమాజంలో అస్పృశ్యత నివారణకు మహాత్మా బసవేశ్వరుడు ఎంతో కృషి చేశారని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో హోప్ ఫౌండేషన్ ఆఫ్ హైదరాబాద్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్‌తో కలిసి సోమవారం బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. చేవెళ్ల, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు కాలె యాద య్య, అంజయ్య యాదవ్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బసవేశ్వరుడు 12వ శతాబ్దంలోనే కులమతాలకు అతీతంగా అందరికీ సమాన హక్కులు కల్పించారని చెప్పారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం బసవేశ్వరుడి జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ తమ్మలి సుబ్రహ్మణ్యేశ్వరి, మాజీ ఎంపీపీ జ్యోతి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తమ్ముడి దారుణ హత్య

- పీఎస్‌లో లొంగిపోయిన నిందితుడు
- నాగసముందర్‌లో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు



హత్యకు గురైన రవికుమార్ (ఫైల్)

యాలాల: ఆస్తి కోసం సొంత తమ్ముడిని గొడ్డలితో నరికి చంపాడు ఓ అన్న. ఈ ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్ఐ అరవింద్‌కుమార్ కథనం మేరకు.. నాగసముందర్ గ్రామానికి చెందిన అంజమ్మ, లక్ష్మయ్య దంపతులకు కృష్ణ, వెంకటేశ్, రవి కుమార్(32) ముగ్గురు సంతానం. రవికుమార్ గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. కొద్ది రోజులుగా ఆస్తి విషయమై రవికుమార్, వెంకటేశ్ మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తున్న రవి మెడపై వెంకటేశ్ గొడ్డలితో దాడి చేశాడు. అనంతరం నేరుగా పీఎస్‌కి వెళ్లి లొంగిపోయాడు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజావాణికి 113 ఫిర్యాదులు

- వెంటనే పరిష్కరించాలని డీఆర్‌ఓ ఆదేశం
- పెండింగ్ సమస్యలపై స్పష్టత ఇవ్వాలని సూచన



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ అశోక్ కుమార్

వికారాబాద్ అర్బన్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీపీఓ తరుణ్‌కుమార్‌లతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజావాణికి మొత్తం 113 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో ఒకే సమస్యపై మూడు, నాలుగు ఫిర్యాదులు అందాయన్నారు. పరిష్కారానికి అవకాశమున్న వాటిని వెంటనే క్లియర్ చేయాలని, లేదంటే ఎందుకు పరిష్కారం కావడం లేదో స్పష్టంగా వివరించాలని సూచించారు. అర్జీదారులు ఒకే సమస్యపై మళ్లీమళ్లీ తిరగకుండా చూడాలన్నారు. ఆయా శాఖల అధికారులు ఈ విషయాన్ని గమనించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుదారులకు అర్థమయ్యేలా చెబితే వారు తిరిగి రారని, సమస్య ఎక్కడ పరిష్కారం అవుతుందో అక్కడికే వెళ్తారని స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యలను సాధ్యమైనంత వరకు తహసీల్దార్ కార్యాలయాల్లోనే పరిష్కరించాలని సూచించారు.

కొండెక్కిన కోడి మాంసం

- తగ్గిన ఉత్పత్తి.. పెరిగిన డిమాండ్
- శుభకార్యాల నేపథ్యంలో భారీగా వాడకం
- అవసరం మేర అందని కోళ్లు



తాండూరు, దోమ: చికెన్ ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయి. నెల రోజుల క్రితం వరకు సరైన రేట్లు లేకపోవడంతో మార్కెట్ కుదేలైంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలువురు రైతులు ఫారాలు మూసేశారు. ప్రస్తుతం ధరలు ఆకాశాన్నంటాయి. స్కిన్ లెస్ చికెన్ కిలోకు రూ.320 వరకు పలుకుతోంది. బోన్‌లెస్ కావాలంటే రూ.550 చెల్లించాల్సిందే. లైవ్ బర్డ్ కిలోకు రూ.190 చొప్పున విక్రయిస్తున్నారు. రెండేళ్ల కాలంలో ఇవే అత్యధిక ధరలని వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవలికాలంలో శుభకార్యాలతో పాటు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో చికెన్‌కు డిమాండ్ పెరిగింది.

బోన్ లెస్ కిలో	రూ.550
స్కిన్ లెస్	రూ.320
లైవ్ బర్డ్	రూ.190

పౌల్ట్రీ వైపు అడుగులు

జిల్లా రైతులు ఇప్పుడిప్పుడే పౌల్ట్రీ రంగం వైపు దృష్టిసారిస్తున్నారు. బ్రాయిలర్ కోళ్ల పెంపకం ద్వారా ఏటా 6 బ్యాచ్‌లు వచ్చే అవకాశం ఉంది. దీంతో కోళ్ల పెంపకం లాభదాయకంగా కొనసాగుతూ వచ్చింది. జిల్లాలోని బొంరాస్‌పేట్‌లో- 4, దోమ 16, యాలాల 18, వికారాబాద్ 7, పూడూరు 12, పరిగి 12, మోమిన్‌పేట్ 6, మర్పల్లి 9, కుల్కచర్ల 5, కొడంగల్, ధారూరులో ఒక్కోటి చొప్పున పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి.

ఎండల ప్రభావంతోనే..

కరోనా తర్వాత ప్రజలు మాంసాహార వాడకాన్ని పెంచారు. ఇందులోనూ చికెన్ వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. వినియోగదారుల అవసరం మేర ఉత్పత్తి లేకపోవడం ప్రస్తుతం కోడిమాసం ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఎండాకాలం కావడంతో అధిక ఉష్ణోగ్రతల కారణంగా కోళ్ల ఎదుగుదలకు ఎక్కువ సమయం పడుతోంది. ఎలాగైనా వీటిని బతికించుకునేందుకు రైతులు, వ్యాపారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఫారాల వద్ద కూలర్లు, రెయిన్ డ్రిప్, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి చల్లదనం అందిస్తున్నారు.

దాణా, మందుల ధరలు రెట్టింపు

కోళ్లకు దాణాగా ఉపయోగించే మొక్కజొన్న, సోయా, తవుడు ధరలు పెరిగాయని నిర్వాహకులు చెబుతున్నారు. దీనికి తోడు వ్యాక్సిన్లు, మందుల ధరలు కూడా రెట్టింపయ్యాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎండల వేడిమికి నిత్యం పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయని చెబుతున్నారు.

ఆశించిన లాభాలు లేవు



గతంలో చికెన్ ధరలు పడిపోవడంతో ఆశించిన స్థాయిలో లాభాలు రాలే దు. దీంతో కొంతమంది ఫారాల నిర్వహణ నుంచి తప్పుకొన్నారు. పదిహేను రోజులుగా మళ్లీ ధరలు పెరుగుతున్నాయి. ఇప్పుడిప్పుడే నష్టాల నుంచి బయట పడుతున్నాం.

– యాదగిరిరెడ్డి, చికెన్ సెంటర్ నిర్వాహకుడు

తినడం తగ్గించాం



గతంలో వారంలో రెండు రోజులు చికెన్‌ను తినే వాళ్లం. ప్రస్తుతం పెరిగిన ధరలతో రెండు వారాలకు ఒకసారి మాత్రమే తీసుకెళ్తన్నాం. మార్కెట్‌లో చికెన్ ధరలు విపరీతంగా పెరిగాయి. చికెన్ బదులు చేపలు తెచ్చుకుంటున్నాం.

– గుడిసె బాబు, బొంపల్లి

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



మహిళకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మోమిన్‌పేట మండలం దేవరంపల్లి, మోమిన్‌పేట, ఇజ్రాచిట్టంపల్లి గ్రామాల లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రైతు బంధు మండల కోఆర్డినేటర్ అజీజ్, సర్పంచు కాశీరాం, నాయకులు రాజు, రవి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

బషీరాబాద్: మండలంలోని మంతట్టి గ్రామానికి చెందిన వీ లక్ష్మి(19) అదృశ్యమైంది. ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాములు కూతురు లక్ష్మి ఈ నెల 10న ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించక పోవడంతో సోమవారం ఆమె సోదరుడు రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన మహిళ

దోమ: స్పీడ్ బ్రేకర్ కారణంగా నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దోమ మండలం గొడుగోనిపల్లిలోని పరిగి – మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్‌ను వేశారు. దీని కారణంగా నిత్యం ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెం మండలం గుర్రంపల్లికి చెందిన ఓ కుటుంబం బైక్‌పై కులకచర్లలోని ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గొడుగోనిపల్లి స్పీడ్ బ్రేకర్‌పై బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో కూడా ఈ స్పీడ్ బ్రేకర్‌పై ప్రమాదాలు జరిగాయి. దీన్ని వెంటనే తొలగించాలని ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు.

ఆకస్మిక తనిఖీలు



ఎరువుల దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

బొంరాస్‌పేట: మండలంలోని తుంకిమెట్లలో గల ఎరువులు, మందుల దుకాణాలను, ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని సోమవారం వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, విత్తనాలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను ఇవ్వాలని ఆదేశించారు. కల్తీ ఎరువులు, మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఇబ్రహీంపట్నం: బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాలు.. ముకునూర్ గ్రామానికి చెందిన ప్రశాంత్(27) తన స్నేహితుడితో కలిసి సోమవారం బైక్‌పై దండుమైలారం గ్రామం వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రశాంత్ అప్పటికే మృతిచెందాడు. అతని స్నేహితుడు స్వల్ప గాయాలతో బయటపడినట్లు తెలిసింది. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పాత వేతనాలకే దిక్కులేదు..

- కొత్త జీతాల జీఓ అమలుపై సందేహాలు
- ఐదు నెలలుగా అర్చకులకు అందని గౌరవ వేతనం
- ఆర్థిక ఇబ్బందుల్లో పూజారులు



కొడంగల్‌లోని గాడిబాయి శివాలయం

కొడంగల్: రాష్ట్ర వ్యాప్తంగా అర్చకులకు సకాలంలో వేతనాలు అందడం లేదు. తెలంగాణ వ్యాప్తంగా 5వేల మందికిపైగా అర్చకులు దీప ధూప నైవేద్యం పథకంలో సభ్యులుగా ఉన్నారు. వారికి ప్రతినెలా రూ. 6వేల గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. ఐదు నెలలుగా గౌరవ వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. రూ. 6వేలలో రెండు వేల రూపాయలు దేవుని పూజ, అలంకరణ, నైవేద్యానికి, దీప ధూపానికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. మిగిలిన నాలుగు వేలు అర్చకునికి గౌరవ వేతనం. అయితే ప్రతి నెలా వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. దీంతో అర్చకులు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. దేవుని సేవకు అంతరాయం ఉండకూడదని అర్చకులు ఆపసోపాలు పడుతున్నారు.

వికారాబాద్ జిల్లాలో...

ముఖ్యమంత్రి కేసీఆర్ 2018 అక్టోబర్‌లో కొత్తగా ఆలయ అర్చకుల నియామకం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 51 మందిని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 350 మంది, తెలంగాణ వ్యాప్తంగా 5వేలకు పైగా అర్చకుల నియామకం జరిగింది. వారికి ప్రతి నెలా రూ. 6వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇన్నాళ్లు దీప ధూప నైవేద్యాలకు నోచుకోని ప్రాచీన ఆలయాలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకానికి ఊపిరి పోశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు అర్చకుల ఖాతాల్లో నెలనెలా వేతనాన్ని జమ చేయాలి. అయితే రెండేళ్లుగా సకాలంలో వేతనాలు రావడం లేదని ప్రభుత్వం ఈ విషయంలో దృష్టి సారించాలని అర్చకులు కోరుతున్నారు.

పాత వేతనాలే లేవు.. కొత్తగా పెంచారు

పాత వేతనాలే ఇవ్వడంలో ప్రభుత్వం తత్సారం చేస్తోంది. వాటిని ఇవ్వకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ వారం రోజుల క్రితం ఆలయ అర్చకుల వేతనాలను పెంచుతున్నట్లు ప్రకటించారు. రూ. 6వేల నుంచి రూ. 10వేలు చేస్తామని చెప్పారు. కేసీఆర్ ఇచ్చిన హామీ ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో ఎక్కలేదని అర్చకులు ఆరోపిస్తున్నారు. ముందు పాత వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. కొత్త వేతనాలు ప్రతి నెలా అర్చకుని ఖాతాలో జమ అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐదు నెలల వేతనాలు రావాలి



ప్రాచీన ఆలయాల్లో దీప ధూప నైవేద్యం కోసం అర్చకుల నియామకం చేపట్టారు. ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ. 6 వేలు ఇస్తున్నారు. అయితే ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి సకాలంలో వేతనాలు చెల్లించి అర్చకులను ఆదుకోవాలి. పాత వేతనాలను పూర్తిగా చెల్లించకుండానే కొత్త వేతనాలను ప్రకటించారు.

– జయతీర్థచారి, డీడీఎస్ అధ్యక్షుడు

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ అభిమతం

పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ అభిమతమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం చౌడాపూర్ మండలం అడవి వెంకటాపూర్, హన్యా నాయక్ తండా, గోగ్యనాయక్ తండా, భజ్యనాయక్ తండా, వీరాపూర్, కొత్తపల్లి, లింగంపల్లి, వాల్యానాయక్ తండాల్లో పల్లె బాట కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని అన్నారు. అడవి వెంకటాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి కావచ్చాయని, త్వరలో లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. గిరిజన గ్రామ పంచాయతీలకు మరిన్ని నిధులు కేటాయించి వాటి అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో అవినీతి చోటు లేదన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా వాటి ఫలితాలు అందేలా సీఎం కేసీఆర్ చొరవ చూపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, మండల కోఆప్షన్ మెంబర్ జుబేర్ మహ్మద్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నర్సింలు, యువజన విభాగం అధ్యక్షుడు మేగ్యనాయక్, పంచాయతీ రాజ్ డీఈ ఉమేష్, ఏఈ మణికుమార్, సర్పంచులు శోభ, రవి, నాయకులు రాజశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పల్లెబాటకు సుధాకర్‌రెడ్డి దూరం

ఎమ్మెల్యే పల్లెబాట కార్యక్రమానికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి డుమ్మా కొట్టారు. అతను పల్లెబాటకు హాజరు కాకపోవడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అనారోగ్యం సాకుగా చూపి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం. మనోహర్‌రెడ్డి వర్గంలోకి వెళ్తున్న కారణంగానే అతను ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొనడం లేదని కొందరు చర్చించుకుంటున్నారు.



భజ్యనాయక్ తండాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



సాక్షి ఎఫెక్ట్..

భూలక్ష్మి చౌరస్తాలో గుంతను పూడ్చిస్తున్న పోలీసులు

పోలీసులంటే కేవలం నేరాల నియంత్రణ, కేసులు నమోదు మాత్రమే కాదు సమాజ సేవలో మేము సైతం అంటూ కదిలారు స్థానిక పోలీసులు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి భూలక్ష్మి చౌరస్తాలో పెద్ద గుంత ఏర్పడి మురుగు నిలిచింది. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో గుంత పడినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ నెల 7న సాక్షి దినపత్రికలో రోడ్డుపైనే మురుగు అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి ఎస్‌ఐ శంకర్ సోమవారం స్పందించి ప్రమాదకర గుంతను పూడ్పించారు. దీంతో మండల ప్రజలు సలాం పోలీస్ అంటూ ఎస్‌ఐని అభినందించారు.

– బొంరాస్‌పేట

ఫలించిన 15ఏళ్ల పోరాటం



యాలాల శివారులో పేదలకు కేటాయించిన భూమి



ఇంటి పట్టాలతో సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

యాలాల: మండల కేంద్రంలో ఇళ్లు లేని వారికి కలగా మిగిలిన సొంతింటి జాగాలు నిజమయ్యాయి. 15 ఏళ్లుగా దళిత సంఘాలతో కలిసి సొంతింటి జాగా కోసం పేదలు ధర్నాలు, దీక్షలు చేస్తున్నారు. ఎట్టకేలకు వారి ప్రయత్నాలు ఫలించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన 123 మంది నిరుపేదలు లబ్ధి పొందుతున్నారు.

2007 నుంచి పోరాటం

మండల కేంద్రంలో సొంతింటి నిర్మాణం కోసం కనీసం గజం స్థలం లేని నిరుపేదలు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం తదితర నాయకులతో కలిసి అప్పట్లో ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెంచారు. అప్పటి ఎమ్మెల్యే పట్నం మహేందర్‌రెడ్డి హయాంలో గ్రామ శివారులోని సర్వే నెంబరు 289లో రెండెకరాల పట్టా భూమిని కొనుగోలు చేసి పట్టాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. కానీ వివిధ కారణాలతో ఆ కార్యక్రమం అటకెక్కింది. అప్పటి నుంచి కనిపించిన ప్రతి మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులకు నిరుపేదలు మొరపెట్టుకున్నారు. పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన, రోడ్లపై ధర్నాలు సైతం చేశారు. దాదాపు 15 ఏళ్ల పోరాటం తరువాత సర్వే నెంబరు 289లోని రెండు ఎకరాలు, సర్వే నెంబరు 220లోని ఎకరా భూమిలో మొత్తం 123 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 75 జాల భూమికి సంబంధించి ఇళ్ల పట్టాలు అందాయి. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే తమకు పట్టాలు అందాయని పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు. సొంత జాగా పొందిన తమకు గృహలక్ష్మి పథకం అమలు చేయాలని వారు కోరుతున్నారు.

15 ఏళ్ల పోరాట ఫలితం



2007 నుంచి ఇళ్ల పట్టాల కోసం పోరాటం చేశాం. దళిత సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధుల చొరవతో పట్టాలు పొందగలిగాం. మాకు అండగా నిలిచిన ఎమ్మెల్యే, ఎంపీపీ, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సాయం చేయాలి.

– బుగ్గప్ప, వ్యకాస జిల్లా అధ్యక్షుడు

ఆర్థిక సాయం అందించాలి



మేం రోజువారి కూలీలం. ఇప్పుడు జాగా ఇచ్చారు. సొంతంగా ఇల్లు నిర్మించుకునే అవకాశం లేదు. గృహలక్ష్మి పథకం కింద పేదల ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిసింది. మాకు కూడా సాయం చేయాలి. లేకుంటే జాగా ఉన్నా ప్రయోజనం ఉండదు.

– సాయమ్మ, లబ్ధిదారు, యాలాల

చాలా సంతోషంగా ఉంది



సొంతింటి జాగా లేక ఏళ్లుగా ఇబ్బందులు పడుతూ వచ్చాం. ప్రస్తుతం ఆ సమస్య తీరింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తే ఇంటి నిర్మాణానికి ఇబ్బందులు ఉండవు. ఇంటి సాగా కోసం మాకు అండగా నిలిచిన దళిత నాయకులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు.

– నర్సమ్మ, లబ్ధిదారు యాలాల

రాజస్థాన్ యువకుడి అనుమానాస్పద మృతి



సురేష్ సిరివి(ఫైల్)

బషీరాబాద్: రాజస్థాన్‌కు చెందిన యువకుడు బషీరాబాద్ మండలంలో ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌లోని పాలి జిల్లా బిరాతియ గ్రామానికి చెందిన సురేష్ సిరివి24) హైదరాబాద్‌లోని ఫిర్జాదిగూడలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం బషీరాబాద్ మండలం నవాల్గా శివారులోని సాయిలుగౌడ్ అనే రైతు పొలంలో ఉరి వేసుకొని చనిపోయాడు. ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి వివరాలు సేకరించారు. మృతదేహం వద్ద లభించిన ఫోన్ మోగడంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రాత్రి ఒంటి గంట సమయంలో సదరు యువకుడు అతడి తమ్ముడు పుష్పరామ్‌కు ఫోన్‌లో తాను చనిపోతున్నట్లు వాయిస్ మెసేజ్ పెట్టాడు. హైదరాబాద్ నుంచి ఇంత దూరం వచ్చి ఎందుకు చనిపోతాడని కుటుంబీకులు అనుమానిస్తున్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

వానాకాలం సాగు షురూ..



గొట్టిగ గ్రామ శివారులో పత్తి విత్తనాలు వేస్తున్న రైతు

తొలకరి వానలతో అన్నదాతలు బిజీ

బషీరాబాద్: తొలకరితో రైతులు వానాకాలం సాగుకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించక ముందే విత్తులో బిజీ అయ్యారు. జిల్లాలో రెండు, మూడు రోజులుగా కురిసిన వర్షాలకు అదును ఉండడంతో జోరుగా విత్తనాలు వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 5.80లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. ఇందులో 75శాతం నల్లరేగడి భూములు. కుల్కచర్ల, దోమ, బొంరాస పేట, కోడంగల్, దౌల్తాబాద్, యాలాల మండలాల్లో చెలక భూములు ఉన్నాయి. నల్లరేగడి భూముల్లో పత్తి, కంది, చెరుకు ఎక్కువగా సాగు చేస్తున్నారు. చెలక భూముల్లో వరి, కందిలో పెసరను అంతర పంటగా పండిస్తున్నారు. బషీరాబాద్‌లో 70శాతం వర్షాధార పంటలనే సాగుచేస్తుంటారు. ప్రతి ఏటా మే, ఏప్రిల్ మాసాల్లో ప్రభుత్వం మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేసేది. ఎంత మేర ఎరువులు వాడాలి, ఏ పటంకు అనుకూలం అనే విషయాలు రైతులకు చెప్పేవారు. ఈ సారి మాత్రం జిల్లాలో ఎక్కడా భూ సార పరీక్షలు చేపట్టలేదు. అయినా రైతులు వానాకాలం సాగును ప్రారంభించారు.

మన పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత పోలీసు వ్యవస్థలో ఎన్నో మార్పులను సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2 కే రన్ నిర్వహించారు. కొడంగల్ చౌరస్తా నుంచి మినీ స్టేడియం వరకు కార్యక్రమం సాగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసు శాఖ ఎంతో పటిష్టంగా ఉందన్నారు. క్రైం రేట్ బాగా తగ్గిందన్నారు. గతంతో పోలిస్తే మన పోలీసుల పనితీరు చాలా మెరుగు పడిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, సీఐ వెంకటరామయ్య, ఎస్సైలు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ విషయంలో దాయాదుల గొడవ

పరిగి: భూ విషయంలో దాయాదుల మధ్య గొడవ జరిగింది. గొడ్డలి, కర్రలతో దాడి చేసుకున్న సంఘటన మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్సై విఠల్‌రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన రాములు అతని కుమారుడు మల్లేష్ పొలం దగ్గర బాట వేస్తుండగా వారి పాలివారు అయిన శ్రీనివాస్, మల్లయ్యలు బాట విషయం, పాత కక్షలు మనసులో పెట్టుకుని దయాదులపై గొడ్డలి, కర్రలతో దాడి చేశారు. దీంతో తండ్రి కొడుకులకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న మనోహర్‌రెడ్డి

పూడూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని డీసీసీబీ చైర్మన్ బీ మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి అనుబంధ గ్రామం దండుగడ్డలో బొడ్రాయి, ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున సామూహిక యజ్ఞాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీశైలంగౌడ్, నాయకులు సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదయ్య, బాలమణి, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- కర్కల్‌పహాడ్ శివారులో ఘటన
- తన తండ్రిపైన అనుమానం ఉందంటూ కుమారుడు ఫిర్యాదు

కడ్తాల్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని కర్కల్‌పహాడ్ శివారులోని ఎస్‌ఎస్ ఫాంహౌస్‌లో సోమవారం ఉదయం వెలుగు చూసింది. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన వల్లభుదాసు స్వరూప(40), శ్రీనివాస్ దంపతులు.. ఇద్దరూ స్థానిక ఫాంహౌస్‌లో కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శ్రీనివాస్‌కు వివాహం జరిగినప్పటి నుంచి మద్యానికి బానిసై తరుచూ భార్యను వేధించేవాడు. ఈ విషయమై గతంలో వారి గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టినా.. భర్త శ్రీనివాస్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. ఇదిలా ఉండగా ఈనెల 11న స్వరూపతో.. శ్రీనివాస్ గొడవపడి ఎక్కడికో వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం ఫాంహౌస్‌లో స్వరూప అనుమానాస్పదంగా మృతి చెంది ఉంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి కుమారుడు వెంకటేశ్ తన అమ్మ మరణం విషయంలో నాన్న శ్రీనివాస్‌పై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- దంపతులకు తీవ్ర గాయాలు
- తుమ్మలూరు గేటు సమీపంలో ప్రమాదం

మహేశ్వరం: బైక్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని తుమ్మలూరు గేటు సమీపంలోని సోమవారం చోటు చేసుకుంది. సీఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండం వెన్నచెర్ల గ్రామానికి చెందిన ముద్దని రాముడు, భార్య శివలీల ఇద్దరూ మండల పరిధిలోని రావిర్యాల గ్రామంలో అద్దెకు నివాసం ఉంటూ మేస్త్రి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం 9:30 గంటలకు రావిర్యాల నుంచి తుమ్మలూరు గేటు సమీపంలో ఉన్న పెద్దమ్మ గుడి వైపు వీరు బైక్‌పై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని 108 అంబులెన్స్‌లో మన్నెగూడలోని మహోనియా ఆస్పత్రికి తరలించారు. వారి బంధువులు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ తంగరాళ్ల లింగయ్యపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.